

బోయినపల్లి: నీలోజిపల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జోగినపల్లి రవీందర్‌రావు, పార్టీ నాయకులు



చొప్పదండి: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సతీమణి సుంకె దీవెన, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి

# అన్ని వర్గాల సంక్షేమానికి కేసీఆర్ కృషి

- **బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జోగినపల్లి రవీందర్‌రావు**
- **చొప్పదండి నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్‌కు మద్దతుగా పార్టీ శ్రేణుల ప్రచారం**



బోయినపల్లి: తడగొండలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా నాయకుడు చెన్నాడి అమిత్‌కుమార్

బోయినపల్లి, నవంబర్ 18: సీఎం కేసీఆర్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జోగినపల్లి రవీందర్‌రావు పేర్కొన్నారు. శనివారం నీలోజిపల్లి ఆర్అండ్ఆర్ కాలనీలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ప్రజలందరూ సమష్టిగా బీఆర్ఎస్‌కు మద్దతు పలుకుతున్నారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌ను ఓడించాలని సాధ్యం కాని హామీలను ఇస్తున్నారని విమర్శించారు. వారి మాయమాటలకు మోసపోతే అరిగోస తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు బంధుసమితి మండల కన్వీనర్ లచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ నాగయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొండయ్య, నాయకుడు భాస్కర్, తదితరులున్నారు.

### కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు

బోయినపల్లి, నవంబర్ 18: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా నాయకుడు చెన్నాడి అమిత్‌కుమార్ హెచ్చరించారు. శనివారం తడగొండలో బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు అధికారం కోసం అర చేతిలో వైకుంఠం చూపించేందుకు అమలుకాని హామీలు ఇస్తున్నారని చెప్పారు. ప్రజలందరూ ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీల మోసాలకు బలి కావద్దని ఓటర్లకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిందం రమేశ్, బీఆర్ఎస్ నాయకుడు కమల్ ఉన్నారు.

### *చొప్పదండిలో పట్టణంలో..*

చొప్పదండి, నవంబర్ 18: పట్టణంలోని ఒకటి, రెండో వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ సతీమణి సుంకె దీవెన, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మితో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సుంకె రవిశంకర్ గెలిచిన తర్వాత చొప్పదండి పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి సుంకె రవిశంకర్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో కౌన్సిలర్ మాడూరి శ్రీనివాస్, మాజీ కోఆప్షన్ మెంబర్ జహీరొద్దీన్, నరేశ్ రావన్, షారుక్, సాయి, ఇషాక్, దుబ్బపల్లె సత్తయ్య, పొన్నం గౌరి, చిల్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- **కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి**
- **చొప్పదండి పోలీస్ స్టేషన్ తనిఖీ**



పోలీసులకు సూచనలు చేస్తున్న సీపీ అభిషేక్ మహంతి

చొప్పదండి, నవంబర్ 18: ఎన్నికల నేరస్తులు, రౌడీ షీటర్లు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి హెచ్చరించారు. చొప్పదండి పోలీస్ స్టేషన్‌ను శనివారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి, ఎన్నికల నేరస్తులు, రౌడీ షీటర్ల వివరాలు తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అవసరమైన ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్, వాహన తనిఖీలు చేపట్టి ఓటర్లకు భద్రతా భావాన్ని కలిగించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న సిబ్బందిని వారికి కేటాయించబడ్డ ప్రాంత పరిధి గురించి అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో ఎన్నికల ప్రచారం ఎక్కువగా జరుగనున్నందున రెట్టించిన ఉత్సాహం, పటిష్ట ప్రణాళికతో పనిచేయాలన్నారు. మోడల్ కోడ్ ఉల్లంఘనలపై దృష్టి పెట్టాలని, గుర్తిస్తే వెంటనే కేసు నమోదు చేయాలన్నారు. నిఘా వ్యవస్థను పటిష్ట పరిచి అనుమతి లేని సమావేశాలు, విందు కార్యక్రమాలు, అక్రమ పంపిణీలను గుర్తించి బాధ్యులతోపాటు సహకరించిన వారిపై కూడా కేసు నమోదు చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకున్నారు. గతంలో ఎన్నికల సమయంలో గొడవలు చేసిన, అల్లర్లను సృష్టించి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి, ఓటర్లను ప్రభావితం చేసే ఎన్నికల నేరస్తులపై, రౌడీ షీటర్లపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని, వారిని సంబంధిత అధికారుల ఎదుట బైండోవర్ చేయాలని, ఉల్లంఘిస్తే బౌండ్ డౌన్ చేసి పూచికత్తు సొమ్ము మొత్తాన్ని జప్తు చేయాల్సి వస్తుందన్నారు. క్షేత్ర స్థాయిలో ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీలకు, వ్యక్తులకు అతీతంగా నిష్పక్షపాతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఉపేంద్రాచారి, సిబ్బంది పాల్గొన్నారు.

## స్మార్ట్ సిటీ పనులపై సమీక్ష

ముకరంపుర, నవంబర్ 18: స్మార్ట్ సిటీలో భాగంగా నగరంలో చేపడుతున్న పనులపై టీఎస్ ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో నగర పాలక సంస్థ, ఎన్పీడీసీఎల్ అధికారులు శనివారం సమీక్ష నిర్వహించారు. ఎన్పీడీసీఎల్, నగర పాలక సంస్థ ఎస్ఈలు వీ గంగాధర్, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు పనులు, మెటీరియల్స్ డివల్యూయేషన్ పై రివ్యూ చేశారు. టర్న్ కీ బేసిస్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని నిర్ణయించారు. డీఈలు రాజం, హరికృష్ణ , కిష్టప్ప, నరేందర్, కే రాజు, ఏఈలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్యాంప్‌నకు సిద్ధార్థ విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న శ్రీపాల్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, నవంబర్ 18: జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌లో గల సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థి అక్షర విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పోటీ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. అక్షరను పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ దాసరి శ్రీపాల్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి క్యాంపులో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి క్యాంపునకు కూడా ఎంపికవ్వాలని ఆకాంక్షించారు.

## అర్హులంతా ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఓటర్లకు పోల్ చీటీలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్

చొప్పదండి, నవంబర్ 18: పట్టణంలో అర్హులంతా ఓటు హక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ కోరారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాల మేరకు పట్టణంలోని 18వ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటర్లకు సంబంధిత బీఎల్వోలు శనివారం పోల్ చీటీలు, ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. పంపిణీ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, పట్టణ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకొని పోలింగ్ శాతాన్ని పెంచాలని కోరారు. మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్, బీఎల్వోలు వసంత, చంద్రకళ, విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలలను సందర్శించిన జేడీ



మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న జేడీ సోమిరెడ్డి

చొప్పదండి, నవంబర్ 18 మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో రెండు రోజుల పాటు ప్రైమరీ లెవెల్, యూపీ లెవెల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఈ క్రమంలో శనివారం విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి మానిటరింగ్‌లో భాగంగా రుక్మాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల, చొప్పదండి బాలుర పాఠశాల, రాగంపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయుల బోధనా తీరును పరిశీలించి, పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రఘుకిశోర్,రాజిరెడ్డి, లచ్చయ్య, మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్బు బిళ్లతో వరల్డ్ కప్

చొప్పదండి, నవంబర్ 18: చొప్పదండిలోని జవహర్ నవోదయ విద్యాలయం ఆర్ట్ టీచర్ గోక నాగేశ్వర రావు సబ్బుతో వరల్డ్ కప్ తయారు చేశారు. ఇండియా వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య ఆదివారం జరిగే క్రికెట్ మ్యాచ్‌లో ఇండియా గెలవాలని నాగేశ్వర రావు సబ్బుపై వరల్డ్ కప్‌ను రూపొందించారు. విద్యాలయం ప్రిన్సిపాల్ మంగ తాయారు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

సబ్బు బిల్లతో తయారు చేసిన వరల్డ్ కప్



## అక్రమ మద్యం పట్టివేత

రాంనగర్, నవంబర్ 18: కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గంగాధర మండలం మల్లాపూర్ వద్ద నరేశ్ అనే వ్యక్తి అక్రమంగా మద్యం తరలిస్తుండగా ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 18 బీర్లు, 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని నరేశ్‌ను అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా మద్యం తరలిస్తే కేసు నమోదు చేస్తామని ఎక్సైజ్ రూరల్ సీఐ తిరుమలత తెలిపారు. అక్రమ మద్యం రవాణాకు సంబంధించి సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. సీఐ వెంట ఎస్ఐ సింధు, సిబ్బంది స్వప్న, రమ్య అశోక్, అనిల్ కుమార్ తదితరులున్నారు.